

జేసీగా శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరణ


జేసీని కలిసిన ఏపీఎన్జీవో నాయకులు

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా శనివారం పి.శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. జేసీగా తన మొదటి పోస్టింగ్ చిత్తూరు జిల్లాకు రావడం సంతోషంగా ఉందన్నారు. తాను అదనపు డైరెక్టర్‌గా సర్వేసెటిల్‌మెంట్ విభాగంలో విజయవాడ హెడ్ ఆఫీసులో పనిచేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రీసర్వే, గృహనిర్మాణం, నవరత్నాల పథకాలు అమలు చేస్తోందని, జిల్లా సమగ్రాభివృద్ధికి కలెక్టర్, అధికారుల సహకారంతో తనవంతు కృషి చేస్తానని తెలిపారు. అంతకుముందు జేసీకి డిఆర్‌ఒ ఎన్.రాజశేఖర్ బోకే అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్‌ను జేసీ మర్యాదపూర్వకంగా కలిసారు. జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, జడ్‌పి సిఇఒ ప్రభాకర్‌రెడ్డి, పంచాయతీ అధికారిణి లక్ష్మి, డిఆర్‌డిఎ పీడీ తులసి, కమిషనర్ జె.అరుణ అభినందనలు తెలియజేశారు.

దేశాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

'ప్రచారభేరి'లో వక్తల పిలుపు



ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

రాజ్యాంగాన్ని రక్షించుకుంటేనే దేశాన్ని మతోన్మాదుల నుంచి కాపాడుకోగలమని వక్తలు ఉద్ఘాటించారు. 'ప్రచారభేరి' రెండో రోజు శనివారం చిత్తూరులోని 39వ డివిజన్ దళితవాడలో జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు, సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వాడా గంగరాజు, నాగరాజు మాట్లాడుతూ 'మోడీని గద్దె దించండి.. దేశాన్ని రక్షించండి' ప్రచార కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గత తొమ్మిదేళ్లుగా పథకం ప్రకారం మత విద్వేషాలను రెచ్చగొట్టడం, రాజ్యాంగ లౌకికతత్వాన్ని విధ్వంసం చేయడం, కార్పొరేటర్ల దేశంగా మార్చేయడం జరుగుతోందన్నారు. మోడీ చేస్తున్న దుర్మార్గాలను ప్రశ్నించేవారిపై కేసులు నమోదు చేయడం, దాడులు చేయడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, వాటిని తగ్గించేందుకు వామపక్షాలు చేస్తున్న కృషి అభినందనీయమని ప్రజల నుంచి స్పందన వచ్చింది. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సురేంద్రన్, చైతన్య, ప్రసాద్, సిపిఐ నాయకులు గోపీ, చంద్ర, సత్యమూర్తి, విజయకుమారి, విజయగౌరి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

టిటిడి విద్యాసంస్థల్లో ఉపాధ్యాయుల నియామకం

టిటిడి ధర్మకర్తల మండలి అధ్యక్షులు వెల్లడి



ప్రజాశక్తి - తిరుమల

తిరుపతిలోని స్విమ్స్ పరిధిలో గల శ్రీ పద్మావతి మహిళా వైద్యకళాశాలలో టిబి, చెస్ట్, స్కిన్ ఇతర ఐసోలేషన్ వార్డులు, స్టాఫ్ క్వార్టర్స్, హాస్టళ్ల నిర్మాణ పనుల కోసం రూ.53.62 కోట్లు మంజూరు చేసినట్టు టిటిడి ధర్మకర్తల మండలి అధ్యక్షులు వైవి.సుబ్బారెడ్డి తెలిపారు. టిటిడి ధర్మకర్తలమండలి సమావేశం శనివారం తిరుమల అన్నమయ్య భవనంలో జరిగింది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఛైర్మన్ మీడియాకు వెల్లడించారు.టిటిడి అవసరాలకు గాను ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన 12 రకాల ఉత్పత్తుల కొనుగోలుకు ధరల నిర్ణయంపై రైతు సాధికార సంస్థ, మార్క్‌ఫెడ్‌తో చర్చించేందుకు టీటీడీ బోర్డు సభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, సనత్ కుమార్, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తో కమిటీ ఏర్పాటు చేశారు. అలిపిరి మార్కెటింగ్ గోడౌన్ వద్ద నూతన గోడౌన్ల నిర్మాణానికి రూ.18 కోట్లు, కోల్డ్ స్టోరేజి నిర్మాణానికి రూ.14 కోట్లు కేటాయించారు.తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ఆధునీకరణ పనులకు రూ.3.12 కోట్లతో టెండరుకు ఆమోదం తెలిపినట్టు ఛైర్మన్ వెల్లడించారు. న్యూఢిల్లీలోని ఎస్వీ కళాశాలలో ఆడిటోరియం అభివృద్ధి పనుల కోసం రూ.4 కోట్లు మంజూరుకు ఆమోదం తెలిపారు. టిటిడి విద్యాసంస్థల్లో రెగ్యులర్ బోధనా సిబ్బంది నియామకానికి ఆమోదం తెలిపారు. ఇప్పటికే పని చేస్తున్న కాంట్రాక్ట్ బోధనా సిబ్బందిని కొనసాగిస్తూనే రెగ్యులర్ ఖాళీ పోస్టులను భర్తీ చేయడానికి ఆమోదం తెలిపారు. ఢిల్లీలోని శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో మే 3 నుంచి 13వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని తీర్మానించారు. తిరుపతిలో నిర్మాణంలో ఉన్న శ్రీనివాస సేతు పనులను త్వరితగతిన పూర్తి చేసి జూన్ 15వ తేదీ నాటికి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు.ఎఫ్.సి.ఆర్.ఎ (విదేశీ విరాళాల స్వీకరణ చట్టం) ప్రకారం విదేశీ భక్తుల నుండి విరాళాలు స్వీకరించడానికి టిటిడికి అనుమతి ఉందని, ఈ అనుమతి 2020 జనవరికి ముగిసిందని, దీనిని రెన్యువల్ చేసుకోవడానికి టిటిడి దరఖాస్తు చేసిందని తెలిపారు.ఎఫ్.సి.ఆర్.ఎ, రాష్ట్ర దేవాదాయ శాఖ చట్టాల మధ్య ఉన్న సాంకేతిక కారణాల వల్ల విరాళాల డిపాజిట్లపై వచ్చే వడ్డీని చూపించడంలో కొన్ని అభ్యంతరాలు తెలిపారు. ఇది సాంకేతిక కారణం మాత్రమేనని, ఎఫ్.సి.ఆర్.ఎ అధికారుల సూచన మేరకు త్వరగా లైసెన్స్ రెన్యువల్ చేసుకోవడానికి రూ.3 కోట్లు చెల్లించడం జరిగిందని, ఇందుకోసం చెల్లించిన రూ.3 కోట్ల సొమ్మును తిరిగి పొందడానికి కషి చేస్తున్నామని తెలిపారు. టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి, బోర్డు సభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి, పోకల అశోక్ కుమార్, కాటసాని రాంభూపాల్ రెడ్డి, జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మంపాల్గొన్నారు.

టిటిడి బోర్డులో అటవీకార్మికుల ఊసేలేదు : సిఐటియు

తిరుపతి టౌన్ : తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సమావేశంలో 900 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న అటవీ కార్మికుల గురించి చర్చించి ఓ నిర్ణయం చేయకపోవడం సమంజసం కాదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఓ ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. ధర్మాన్ని రక్షించండి ఆ ధర్మమే మిమ్మల్ని కాపాడుతుందని ప్రతినిత్యం ప్రచారం చేసే టిటిడి పేద అటవీ కార్మికుల పట్ల అన్యాయంగా ప్రవర్తిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర హైకోర్టు చెప్పిన సూచనలను పాటించకుండా, తాను చేసిన తీర్మానాన్ని సైతం బోర్డు అమలు చేయకుండా, 362 మంది కార్మికుల్లో 162 మందిని పర్మినెంట్ చేసి 200 మందిని వీధుల పాలు చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ వివక్షకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. దేవదేవుని ఎదుటే యాజమాన్యం పేద కార్మికుల పట్ల అన్యాయంగా ప్రవర్తిస్తుంటే ఎవరికి చెప్పుకోవాలని ఆయన సూటిగా ప్రశ్నించారు. టిటిడి యాజమాన్యం అటవీ కార్మికులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు

క్షయ వ్యాధి లేని జిల్లాగా ప్రకటించుకోవాలి : డిఆర్‌ఒ

చిత్తూరు అర్బన్ : ఈ ఆర్థిక సంవత్సరం క్షయవ్యాధి లేని జిల్లాగా ప్రకటించుకోవాలని డిఆర్‌ఒ ఎన్.రాజశేఖర్ అన్నారు. శనివారం ఉదయం డిఆర్‌ఓ సమావేశం హాల్ నందు ఐసియంఆర్ ప్రాజెక్టు హెడ్ కె. ఆర్, జాన్, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి మూర్తి, జడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రకాశం, జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ రవి రాజు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి నాగ శైలజ ల తో కలిసి కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐ సి యం ఆర్ ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని గిరిజన గ్రామాల్లో క్షయ వ్యాధి నిర్మూలన పై నిర్వహించే అవగాహన కార్యక్రమాలకు సంబందితా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని గిరిజన గ్రామాలలో పర్యటించి ఇంటింటా సర్వే చేసి అవసరమైన క్షయ వ్యాధిగ్రస్తులకు టెస్టులు చేసి వారికి అవసరమైన మందులను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసియంఆర్ డిఆర్డిఏ స్త్రీ శిశు సంక్షేమ గిరిజన సంక్షేమ, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల దర్శనానికి 'బైక్'లు అద్దెకు!



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతిలో కొత్తగా రెంట్ బైకులు అందుబాటులోకి వచ్చాయి. 24 గంటలకు 600 రూపాయలు తీసుకుంటున్నారు. తిరుపతి లోకల్ దేవాలయాలన్నీ చూడటానికి, కొండపైన ఘాట్ రోడ్ మంచి డ్రైవింగ్ ఎక్స్పీరియన్స్ ఒక వెయ్యి రూపాయల తో ఇద్దరు తిరుపతి లోకల్ దేవాలయాలు కాళహస్తి, కాణిపాకం, చంద్రగిరి కోట, శ్రీనివాస మంగాపురం, వకుళ మాత టెంపుల్, తిరుచానూరు, కపిల తీర్థం, ఇస్కాన్ టెంపుల్, గోవిందరాజు స్వామి గుడి, కోదండ రామస్వామి ఆలయం, జూ పార్క్, పాపవినాశనం, శ్రీవారి పాదాలు అన్నీ కూడా మనకు నచ్చిన సమయంలో నచ్చిన విధంగా ఓపికగా చూడవచ్చు. రైల్వే స్టేషన్‌కు వద్దకే వచ్చి కోరిన వారికి బైక్‌లు అందిస్తారు. ఈ బైక్‌లు అందించే సర్వీసు 24 గంటలు అందుబాటులో ఉంటుంది. హాతిరామ్ ట్రావెల్స్, 9989589251, 7671029282 ఫోన్ నంబర్లకు కాల్ చేయవచ్చు.

ఆలయానికి ఐదు ఆర్వో ప్లాంట్లు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ దివీస్ ల్యాబోరేటరీస్ అధినేత మురళి ఐదు ఆర్వో ప్లాంట్లను వితరణ చేస్తున్నట్లు తెలిపారు. స్వామి వారి జలప్రసాదం వద్ద ఈ ప్లాంట్ల ఏర్పాటుకు శనివారం భూమి పూజ చేశారు. ఈ నెల 27వ తేదీన ఆర్వో ప్లాంట్లు ప్రారంభిస్తామనీ, వేసవి దప్పు ఏర్పాటు చేస్తున్న దాతకు ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు కతజ్ఞతలు తెలిపారు.

నేడు యుపిఎస్‌సి పరీక్షలు: ఆర్‌డిఒ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఈ నెల 16 న యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ కంబైండ్ డిఫెన్స్ సర్వీసెస్ –, నేషనల్ డిఫెన్స్ అకాడమి –, నావల్ అకాడమి – పరీక్షలు నిర్వహణకు ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని తిరుపతి ఆర్.డి.ఓ., పరీక్షల కస్టోడియన్ వి.కనకనరసా రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం స్థానిక ఆర్.డి.ఓ. కార్యాలయంలో యు.పి.ఎస్.సి. పరీక్షల నిర్వహణపై ఆర్.డి.ఓ., యు.పి.ఎస్.సి.న్యూ ఢిల్లీ సూపరింటెండెంట్ శ్రీరామ్ సమీక్ష నిర్వహించారు. ఆర్‌డిఓ మాట్లాడుతూ అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఐ.డి. ప్రూఫ్ తీసుకుని రావాలని, ఎలక్ట్రానిక్ వస్తువులు, క్యాలికులేటర్ వంటివి పరీక్షా కేంద్రాలలోకి అనుమతి ఉండదని అన్నారు. పరీక్షా సమయానికి 10 నిమిషాల ముందుగానే ప్రధాన ద్వారాలు మూసివేస్తారని అన్నారు. పరీక్షా సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఎస్.పి.డి.సి.ఎల్. వారికి సూచించారు. ఈ సమీక్షలో తహశీల్దార్లు సుబ్రహ్మణ్యం, రోశయ్య, ద్వారకానాథ రెడ్డి, ప్రమీల, పరీక్షా కేంద్రాల సూపర్‌వైజర్లు ఎ.పి.ఎస్.పి.డి.సి.ఎల్. శ్రీనివాసుల నాయుడు, పోస్టల్ శాఖ రెడ్డెప్ప, స్పెషల్ బ్రాంచ్ శ్రీనివాసులు, మెడికల్ డా.ఊర్మిళ, డి.టి. లు లక్ష్మీనారాయణ, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం : కలెక్టర్

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

డ్రగ్స్ రహిత జిల్లాగా చిత్తూరును తీర్చిదిద్దుదామని కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. శనివారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్, ఎస్పి వై.రిశాంత్ రెడ్డి, ఏఎస్పి శ్రీలక్ష్మి, ట్రైనీ కలెక్టర్ వై.మేఘ స్వరూప్, డిఎఫ్ఓ చైతన్య కుమార్ రెడ్డి, డి ఆర్ ఓ ఎన్. రాజశేఖర్ లతో కలసి నార్కోటిక్ కో ఆర్డినేషన్ జిల్లా స్థాయి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ భావిభారత నిర్మాతలైన యువత మాదకద్రవ్యాల బారిన పడి వారి విలువైన జీవితాన్ని వ్యర్థం చేసుకోకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు అందరిపై ఉందన్నారు. జిల్లాలో మాదక ద్రవ్యాల బారిన పడిన వారికి కౌన్సిలింగ్ ఇచ్చేందుకు అవసరమైన పునరావాస కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని డి ఎం అండ్ హెచ్ ఓ ను ఆదేశించారు. ఎస్ పి మాట్లాడుతూ చిత్తూరు జిల్లా తమిళనాడు, కర్ణాటక రెండు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉండడంతో ఇతర రాష్ట్రాల నుండి మాదక ద్రవ్యాల రవాణాను కట్టడి చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని, జిల్లాలో గంజాయి, సింథటిక్ డ్రగ్స్ వాడకం గల ప్రాంతాల పైన ప్రత్యేక నిఘాను ఉంచామన్నారు. మాదక ద్రవ్యాలకు సంబంధించి ఎటువంటి సమాచారం ఉన్నా 14500 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించవచ్చునని తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ ఆయిషా, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖాధికారులు మురళి కష్ణ, మధుసూదన్ రెడ్డి, శోభా రాణి, డి ఎం హెచ్ ఓ డా. ప్రకాశం పాల్గొన్నారు.



సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై ప్రత్యేక శ్రద్ధ

జిల్లాలో సుస్థిర అభివద్ధి లక్ష్యాల సాధనపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పని చేయాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ ట్రైనీ కలెక్టర్ వై.మేఘ స్వరూప్, డి ఆర్ ఓ ఎన్. రాజశేఖర్, ట్రైన్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి లతో కలిపి జిల్లాలో సుస్థిర అభివద్ధి లక్ష్యాల సాధనకు తీసుకోవలసిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు, గర్భవతులు, బాలింతలలో రక్తహీనత నివారణకు తీసుకోవలసిన చర్యలపై స్త్రీ శిశు సంక్షేమ శాఖ,వైద్య ఆరోగ్యశాఖ కలిసి పని చేయాలని సూచించారు. సమావేశంలో సిపిఓ ఉమాదేవి, జెడ్పిసిఈఓ ప్రభాకర్ రెడ్డి, డిఎంఅండ్ హెచ్ ఓ డాక్టర్ ప్రకాశం, సమగ్ర శిక్ష ఏపీసి వెంకట రమణారెడ్డి, ఐసిడిఎస్ పిడి నాగ శైలజ, చిత్తూరు డిఎల్‌డిఓ రవికుమార్ పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనులను వేగవంతం చేయండి

ప్రభుత్వ పాఠశాలలో అత్యుత్తమ వసతులను కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నాడు- నేడు పథకం తీసుకురావడం జరిగిందని, ఆ పనులను వేగవంతంగా పూర్తి చేసి పాఠశాలలకు అప్పగించే పని చేయాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ అన్నారు. జిల్లా కలెక్టర్ శని వారం జిల్లాసచివాలయంలోని సమా వేశపు మందిరం లో జిల్లా కలెక్టర్ ట్రైన్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ కలిసి జిల్లాలో జరుగుతున్న నాడు-నేడు పథకం కు సంబంధించి పాఠశాలలో చేపడు తున్న కార్యక్రమాల స్టేజ్ కన్వర్షన్ పూర్తి చేసే కార్యక్రమాల గురించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గతంలో 735 పాఠశాలలను రూ. 224 కోట్లతో అభివద్ధి చేయడం జరిగిందని, అదేవిధంగా రెండవ దశలో 1180 పాఠశాలలు 30 జూనియర్ కళాశాలలో మౌలిక సదుపాయాలను కల్పించడానికి నాడు- నేడు పథకం చేపట్టడం జరిగిందన్నారు. నిర్ణ యించిన పనులను అంశాల వారీగా సమగ్ర శిక్ష ఏ పి సి వెంకట రమణా రెడ్డి వివరించారు. ఈ సమావేశంలో ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ శంకర బాబు, ఆర్ అండ్ బి ఎస్ఈ దేవానందం, ఏపీఎంఐసి డిడి ధనంజయ పాల్గొన్నారు.

తిరుపతి వైపు ...ఐటీ చూపు

డబ్ల్యుటిఐటిసి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి ఆపెటా భవనంలో శనివారం ప్రపంచ తెలుగు సమాచార సాంకేతిక మండలి (డబ్ల్యుటిఐటిసి) కార్యాలయ ప్రారంభోత్సవం జరిగింది. తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కంపెనీ వారు ప్రధానంగా వివిధ దేశాలలో ఉన్న ఐటీ, నాన్ ఐటీ కంపెనీలతో సమన్వయం చేసి మన ప్రాంతంలో పెట్టుబడులు పెట్టేలా మధ్యవర్తిత్వం వహిస్తుందని ఆ కంపెనీ సీఈఓ సందీప్ మత్కల అన్నారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి కానీ, అపెటా ప్రతినిధులు చెవిరెడ్డి హేమచంద్రా రెడ్డి, కిరణ్ కాని ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు వారి సంపూర్ణ సహకారం అందిస్తున్నారని ఇక్కడ పెట్టుబడులు ప్రోత్సాహించేందుకు తమ వంతు కషి చేస్తామని ఆయన తెలియజేసారు. అనంతరం ప్రపంచ తెలుగు సమాచార సాంకేతిక మండలి వారి ఆదర్వంలో ఐటీ, నాన్ ఐటీ రంగాలకు చెందిన 15 కంపెనీల సీఈఓలతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి ప్రారంభోపన్యాసం చేస్తూ తిరుపతి పట్టణంలో ఐటీ కంపెనీల స్థాపనకు ఆసక్తి చూపుతూ ఇక్కడికి విచ్చేసిన కంపెనీల సీఈఓలకు, ప్రతినిధులకు పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. నేడు తిరుపతి ఐఐటీ, ఐజర్, ఎస్వీ యూనివర్సిటీ, పద్మావతి యూనివర్సిటీ లాంటి ప్రఖ్యాత విద్యా సంస్థలతో విరాజిల్లుతోంది. ఈ విద్యా సంస్థల నుండి ప్రతి ఏటా వేల సంఖ్యలో విద్యార్థులు ఉత్తీర్ణులు అవుతున్నారు. తిరుపతిలో ఐటీ కంపెనీల స్థాపించి పెట్టుబడులు పెట్టడం వలన మొదటగా ఐటీ కంపెనీలకు అవసరమైన మానవ వనరుల అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో సూట్స్ కేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ డాక్టర్ సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తిరుపతి దేవదేవుని చెంత తమ కంపెనీ నెలకొల్పే అవకాశం రావడం అదష్టంగా భావిస్తున్నామని 300 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టేందుకు ఎంఓయు కుదుర్చుకొన్నామని, తద్వారా సుమారుగా 2వేల మందికి ఉపాధి కల్పించనున్నామని చెప్పారు. డిజితాన్ ఛైర్మన్ సందీప్ కుమార్ మత్కల్ మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా తిరుపతిలో ప్రముఖ విద్యా సంస్థలు ఉన్నాయని తద్వారా నాణ్యమైన మానవ వనరులు అందుబాటులో ఉంటాయని 100 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఎంఓయులు జరిగాయని, తద్వారా సుమారు 300 మందికి ఉపాధి కల్పించానున్నామని చెప్పారు. సైమ్యాక్స్ ఇన్ఫోట్కన్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ ఎం.గౌరీశంకర్ మాట్లాడుతూ తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో తన విద్యాభ్యాసం కొనసాగిందని వ్యాపార విస్తరణలో భాగంగా తిరుపతి అభివద్ధిలో భాగమయ్యే అవకాశం దొరికిందని, సుమారు 100 కోట్ల పెట్టుబడి పెట్టనున్నామని, తద్వారా సుమారు 250 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని అన్నారు. ఎస్ఆర్ఆర్ క్లౌడ్ ఎక్స్పర్ట్స్ గురూ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ 10 కోట్లతో 100 మందికి ఉద్యోగ కల్పన, సైబర్ కోంబాట్ సెక్యూరిటీ సర్వీసెస్ ప్రై.లి 10 కోట్లతో 50 మందికి ఉద్యోగ కల్పన, వేల్ ఐటీ సొల్యూషన్స్ 10 కోట్లతో 150 మందికి ఉద్యోగ కల్పన, ఫ్యూజెనిక్ పవర్ సొల్యూషన్, ఐడియావటర్ సొల్యూషన్స్ ప్రై.లి 10 కోట్లతో 100 మందికి ఉపాధి కలిపించునున్నామని ఆ కంపెనీ ప్రతినిధులు తెలియజేసారు.





ఈసురోమంటున్న 'ఉపాధి'

- సరాసరి 50 రోజులే పని దినాలు
- జిల్లాలో 100 రోజుల ఉపాధి హుళక్కే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

గ్రామీణ పేదలకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలుస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టంపై నీలినీడలు కమ్ముకొంటున్నాయి. బడ్జెట్ కేటాయింపుల కుదింపుకు తోడు నిధుల విడుదలలో జాప్యం, పర్యవేక్షణ లోపం, అసంబద్ధ నిబంధనలు వెరసి ఆ పథకం అమలుకు ప్రతిబంధకంగా మారాయి. ముఖ్యంగా రాష్ట్రాలపైనే అమలు భారం మోపాలన్న ప్రతిపాదనలు మరింత ఆందోళన రేకెత్తిస్తున్నాయి. ప్రతి కూలీకి కనీసం వంద రోజులు పనిదినాలు కల్పించాలనే నిబంధన ఉన్నా, సరాసరి కేవలం 50 రోజులు మాత్రమే పనులు కల్పించడం ఈ పథకం అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూపుతున్న చిత్తశుద్ధి అర్థమవుతోంది. ఉపాధి హామీ పథకం కింద దేశంలో ఆరేళ్లుగా కూలీలకు ఏటా సగటున 50 రోజుల కంటే తక్కువగానే పని దక్కింది. ఈ సమాచారాన్ని ఇటీవలి పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వమే వెల్లడించింది. దీనికి తగ్గట్లుగానే తిరుపతి జిల్లాలో ఈ పథకం ఈసురోమంటోంది.

ఉపాధి హామీ పథకంలో మోడీ ప్రభుత్వం తనదైన ముద్రను చాటేందుకు మార్పులు చేర్పులు చేపట్టి కొత్తకొత్త నిబంధనలను తెస్తున్నట్లు నిపుణులు విమర్శిస్తున్నారు. నిధుల కొరతకు తోడు ఇతర కారణాల వల్ల ప్రతి సంవత్సరం 100 రోజుల పనులను కేంద్రం కల్పించడం లేదు. 2021-22లో సగటున 50 రోజులు, 2020- 21లో 52 రోజులు మాత్రమే పని దక్కిందని జాతీయ లెక్కలు చెబుతున్నాయు. తిరుపతి జిల్లాలో సుమారు రెండు లక్షలా 80 వేలకు పైగా జాబ్ కార్డులు కలిగిన కుటుంబాలున్నాయి. వీరిలో 50శాతం కుటుంబాలు కూడా 50 రోజుల పని దినాలు పూర్తి చేసుకోని పరిస్థితి. శ్రీకాళహస్తి డ్వామా క్లస్టర్ లో 61 వేలకు పైగా జాబ్ కార్డులు ఉన్నాయి. వీటిలో 50 వేలకు పైగా కార్డులు యాక్టీవ్ లో ఉన్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 40 వేలకు పైగా కుటుంబాలు ఉపాధి పనులకు వెళ్ళగా కేవలం 4 వేల కుటుంబాలు మాత్రమే వందరోజులు పూర్తి చేసుకోవడం గమనార్హం.

బిల్లుల చెల్లింపుల్లో జాప్యం

ఉపాధి పథకానికి బడ్జెట్ కేటాయించడంలో, కూలీలకు బిల్లులు చెల్లించడంలో తీవ్ర జాప్యం నెలకొంటోంది. కేంద్రం సరైన శ్రద్ధ చూపకపోవడం వల్ల రాష్ట్రానికో తీరుగా చెల్లింపులు జరుగుతున్నాయి. జాతీయ మొబైల్ పర్యవేక్షక వ్యవస్థ (ఎన్ఎంఎంఎస్) కింద రోజువారీగా కూలీల వివరాలను నమోదు చేయాల్సి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ ఇంటర్నెట్ సేవలు అంతంత మాత్రంగానే ఉండడంతో కూలీల నమోదులో సమస్యలు తలెత్తుతున్నాయి. మరోవైపు చెల్లింపుల కోసం జాబ్‌కార్డుకు ఆధార్, బ్యాంకు ఖాతాలను అనుసంధానం చేయాలన్న నిబంధన తెచ్చారు. చాలామంది ఆధార్ కార్డుల్లో తప్పులు దొర్లడం, బ్యాంకు ఖాతాలు లేకపోవడం వంటి కారణాలతో చెల్లింపులు జరగడం లేదు. కేంద్రం 2022-23 బడ్జెట్లో ఉపాధి హామీ పథకానికి రూ. 73 వేల కోట్లను కేటాయించింది. సవరించిన అంచనాల్లో అది రూ. 89 వేల కోట్లను దాటింది. అంతకు ముందు బడ్జెట్లో రూ.73 వేల కోట్లు కేటాయించారు. ఇటీవలి పద్దులో మాత్రం నిరుటితో పోలిస్తే నిధులను భారీగా తెగ్గోసి రూ.60 వేల కోట్లే కేటాయించారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా పేర్లు నమోదు చేసుకున్న కూలీలకు సరిగ్గా పనులు దొరకని పరిస్థితి నెలకొంది. నిధులకు కత్తెర వేయడం వల్ల మరింత మంది ఉపాధిని కోల్పోయే ప్రమాదం ఉంది. ఇటీవల కేంద్ర గ్రామీణాభివద్ధి శాఖా మంత్రి గిరిరాజ్ సింగ్ చేసిన ప్రకటన పిడుగుపాటులా పరిణమించింది. పథకం నిధులను 60శాతం కేంద్రం ఇస్తూ రాష్ట్రాలు మరో 40శాతం భరించాలనే ప్రతిపాదనను ఆయన తెచ్చారు. తద్వారా పథకం అమలులో అవినీతిని కట్టడిచేయడానికి రాష్ట్రాలు కషి చేస్తాయని ఆయన విశ్లేషించారు. వాస్తవానికి కేంద్రం, రాష్ట్రాల ఉమ్మడి పథకాలు సరిగ్గా అమలు కావడం లేదు. అందువల్ల ఉపాధి హామీ పథకాన్ని కేంద్రమే పూర్తిగా, సమర్థంగా అమలు చేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

150 పని దినాలు కల్పించాలి: రాజా, ఉపాధి కూలీ, బోనుపల్లి



గతంలో ఉపాధి పనులు చేతి నిండా ఉండేవి. గత పదేళ్లుగా కూలీలకు పనులు తగ్గి పోయాయి. ఏడాదికి 50 పని దినాలు చేస్తే గొప్పేననుకోవాలి. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు బాగా తగ్గిపోయాయి. యువత ఉపాధి కోసం ఉపాధి హామీ పథకాన్ని ఎంచుకుంటోంది. ఈ క్రమంలో దానికీ గండి కొట్టాలని చూడటం దుర్మార్గం. కనీసం కుటుంబానికి 150 పని దినాలు కల్పించాలి.

అకాల వర్షాలతో దెబ్బతిన్న మామిడి



ప్రజాశక్తి-పలమనేరు: జిల్లాలోని తూర్పు, పడమట మండలాల్లో అత్యధికంగా మామిడి పంట సాగు చేస్తారు. ఇవి ప్రకృతి వైపరీత్యాలకు పూర్తిగా రాలిపోవడంతో రైతులు తీవ్ర నష్టాల బారిన పడాల్సి వస్తుంది. ముసలిమడుగు, మండీపేట, కోటూరు, నలగాంపల్లి, సంబార్పురం, కరిడిమడుగు, సముద్రపల్లి, నూనెవారిపల్లి, క్రిష్ణాపురం తదితర ప్రాంతాల్లో గత మార్చిలో కురిసిన అకాల వడగళ్ల వర్షాల కారణంగా మామిడి చెట్లలోని పూత, పిందెలు నేలరాలిపోయాయి. దీంతో ఇక మే నెలలో కురిసే అకాల వర్షాలకు ఉన్న కాస్తో, కూస్తో కాయలు రాలిపోతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈసారి మామిడి కాయలు ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. పంటపెట్టుబడులకు రూ.లక్షలు అప్పులుచేసి సంవత్సరం పొడవునా అష్టకష్టాలు పడి మామిడి ఫలసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న రైతులకు ప్రకృతి వైపరీత్యాలతో సంభవిస్తున్న వర్షాల కారణంగా తోటలు దెబ్బతిని ప్రతిసారీ ఇలా నష్టపోతూనేవున్నారు. ఇలాంటి సందర్భాల్లో ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని, ప్రస్తుతం ప్రభుత్వం రైతులకు ఉచిత పంటల బీమా కొన్ని పంటలకు మాత్రమే ఇస్తున్నారు. మామిడి, కొబ్బరి తదితర పంటలను పంటలబీమాలో చేర్చకపోవడంతో వారు పూర్తిగా నష్టపోతున్నారు. ఇకనైనా ప్రభుత్వం పంటలబీమాలో ఉద్యానవన పంటలైన మామిడి, కొబ్బరి తదితర పంటలను చేర్చి మామిడి రైతులను ఆదుకోవాలని పలమనేరు ప్రాంతాల్లోని రైతులు కోరుతున్నారు. చిత్తూరు జిల్లాలో ఎక్కువగా పండించే ప్రధాన పంటలు మామిడి, పడమటి ప్రాంతంలో టమాటా పంటలే ఎక్కువ పండిస్తారు. ఇలాంటి ప్రధానమైన పంటలకు ప్రత్యేక మామిడి బోర్డును ఏర్పాటు చేయకపోవడం చాలా బాధాకరం. ఉదాహరణకు పొగాకు పండించే హైనికర్నాటకలో అందరికీ తెలిసిందే. అలాంటి పొగాకుకు ప్రభుత్వం ప్రత్యేక పొగాకు బోర్డును ఏర్పాటు చేశారు. అలాగే అందరికీ ఆరోగ్యకరమైన అత్యధికమైన మధురమైన మామిడి పళ్లకు మాత్రం మామిడి బోర్డును ఎందుకు ప్రవేశపెట్టరు. ఈ విషయాన్ని గత కొన్ని సంవత్సరాలుగా రైతు సంఘాలు అడుగుతున్నా ఇంతవరకు లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రత్యేక మామిడి బోర్డును ఏర్పాటు చేయాలని జిల్లాలోని వ్యవసాయ రైతు సంఘాల నాయకులు ఓబులరాజు, ఉమాపతి నాయుడు కోరుతున్నారు.

ప్రజల అవసరాలకు తగ్గట్టు స్పందించాలి



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రజల అవసరాలకు తగిన విధంగా స్పందించి ప్రభుత్వ ఆశయాల మేరకు విధి నిర్వహణలో ఎలాంటి ఆలోచన లేకుండా పని చేయాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు తెలిపారు. శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన తన ఛాంబర్‌లో ముఖ్య ప్రణాళిక అధికారి, భూసేకరణ, సివిల్ సప్లైస్, సర్వే శాఖ కార్యాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఎప్పటి కప్పుడు పరిష్కరించాలన్నారు. రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా నిర్వహించడం జరుగుతున్నదన్నారు. జాయింట్ కలెక్టర్ వెంట సిపిఒ ఉమాదేవి, సివిల్ సప్లై అధికారి శంకరన్, ఏడీ సర్వే ల్యాండ్ రికార్డ్స్ కనక ప్రసాద్, భూసేకరణ సూపరింటెండెంట్లు ఉన్నారు.

■ రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే పనులను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని ఎటువంటి లోపాలు లేకుండా ఈ సర్వే క్రమాలు నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం జాయింట్ కలెక్టర్ రీ సర్వే అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సర్వే రాళ్ల నాటే కార్యక్రమం వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఉన్న రోవర్లను సర్వే రాళ్ల నాటే కార్యక్రమానికి ఉపయోగించాలని అన్నారు. ఎడి సర్వే ల్యాండ్ రికార్డ్స్ కనక ప్రసాద్, ఎస్‌డిఓ పర్వీన్, డిటి శివకుమార్, గణేష్, గిరి తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ ప్రారంభం



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నగరంలోని బిఎస్ కన్నన్ కళాశాల ఆవరణలో శనివారం వసుంధర దుబాయ్ సిటీ ఎగ్జిబిషన్‌ను చిత్తూరు ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, కార్పొరేటర్ చలమత్తు, నిర్వాహకులు మల్లికార్జునతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎగ్జిబిషన్ ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. లండన్ బ్రిడ్జ్, మలేషియా, దుబాయ్ టవర్ల లాంటి నమూనాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలు నిత్యం శారీరక, మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. దీనిని అధిగమించాలంటే ప్రతి మనిషికి వినోదం, ఉల్లాసం చాలా అవసరం అన్నారు. తమ ఆరోగ్యం కోసం ఇలాంటి ఎగ్జిబిషన్లో ఉన్న ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అతి తక్కువ ధరకే పెద్ద ఎత్తున వినోదం పంచే జాయింట్ వీల్, కొలంబస్, డ్రాగన్ ట్రైన్, హేర్ బెలూన్ గేమ్ తదితర వినోదాత్మక ఆట వస్తువులు ఏర్పాటు చేశామన్నారు. 45 రోజులపాటు చిత్తూరు నగర పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పూర్ణ, కో ఆప్షన్ మెంబర్ కోలాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



ప్రజాశక్తి-రామకుప్పం: మండల టీడీపీ కార్యాలయం వద్ద మాజీ సీఎం చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్ ముస్లిం పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా రామకుప్పం మేజర్ గ్రామపంచాయతీ టౌన్‌లో కొంత మందికి తన సొంత డబ్బులతో రంజాన్ తోఫాను అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పిఎస్ మునిరత్నం, కుప్పం పరిశీలకులు ఖాదర్ షరీఫ్, అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు మునుస్వామి, మైనారిటీ నాయకులు సలాం, రఫీ, తన్వీద్, అదిల్, హనీఫ్, మొదలగు మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

పుంగనూరు: పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని పేద ముస్లిం



కుటుంబాలకు శనివారం స్థానిక గాంధీనగర్‌లోని షాదీ మహల్లో రంజాన్ కిట్లు పంపిణీ చేసినట్లు మహమ్మదీయ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు ముజాహిద్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర వస్తువులైన బియ్యం, పప్పులు, గోధుమ, సేమియా సుమారు రూ.5 వేలు విలువచేసే వస్తువులను పంపిణీ చేశామన్నారు. సుమారు 500 కుటుంబాలకు రంజాన్ కిట్లు డోర్ డెలివరీ చేస్తున్నట్లు చెప్పారు. మహమ్మదీయ వెల్ఫేర్ కమిటీ కార్యదర్శి మున్నా, ట్రెజరర్ అల్తాఫ్, సభ్యులు, నూరుల్లా, కరీమ్, నౌషాద్, విసిబి అహ్మద్, ఖాజా, భాష, రమీజ్, ఇమ్రాన్, ఉస్మాన్, సుహెల్, ఇంటూ, ఇందాద్, నవాజ్ పాల్గొన్నారు.

గర్భిణులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: గర్భిణులు, చిన్నపిల్లలు, బాలింతలకు సకాలంలో పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ తెలిపారు. శనివారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్, ట్రైనీ కలెక్టర్ వై.మేఘ స్వరూప్‌తో కలిసి స్త్రీ శిశుసంక్షేమ శాఖ పిడి నాగ శైలజ, సిడిపిఒలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 2420 అంగన్వాడీ కేంద్రాలలోని 0-5 మధ్య వయస్సు 1,04,000 మంది పిల్లలకు, 11,600 మంది గర్భిణులకు, 12,100 మంది బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం సకాలంలో అంద జేయాలని సూచించారు. చిన్నపిల్లలు ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా చూడాలన్నారు. గర్భిణులలో రక్తహీనత నివారణకు తీసుకోవలసిన పౌష్టికాహారం, జాగ్రత్తలపై అవగాహన పెంచాలన్నారు. స్త్రీ శిశుసంక్షేమ శాఖ ద్వారా అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవల గురించి పిడి కలెక్టర్‌కు వివరించారు.

■ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు ఇంటి సౌకర్యం కల్పించాలనే మహోన్నత ఆశయంతో పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం చేపట్టారని, ఇందులో భాగంగా కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. శనివారంసాయంత్రం జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, ట్రైనీ కలెక్టర్ వై.మేఘ స్వరూప్ లతో కలిసి గృహ నిర్మాణ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు 71,651 గృహాలు మంజూరు కాగా ఇప్పటివరకు 28,787 గృహాలు పూర్తి అయ్యాయని ఇంకా చేరాల్సిన లక్ష్యాలను సాధించడానికి మరింత కృషి చేయాలన్నారు. వారాంతపు లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఇంకా ఇండ్ల నిర్మాణం ప్రారంభించనీ నిర్మాణాల పనులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. స్టేజి కన్వర్షన్ వేగంగా జరగాలన్నారు. గంగాధరనెల్లూరు, చిత్తూరు, నగరి నియోజకవర్గాల పరిధిలో మరింత వేగవంతం చేయాలన్నారు. జగనన్న కాలనీలలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పిడి పద్మనాభం, డిఇలు రమణారెడ్డి, వెంకటేశ్వర్లు, గురురాజన్, శంకరప్ప, మధుసూదన్ రెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తుకు విశేష స్పందన



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని వైసీపీ జిల్లా ఇన్‌ఛార్జ్, ఎమ్మెల్సీ భరత్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ ఈనెల 7వ తేదీ నుంచి ప్రారంభించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంతో 63 లక్షల మంది కుటుంబాలను వైసీపీ శ్రేణులు సందర్శించి ప్రభుత్వ పాలనపై వారి అభిప్రాయాలను సేకరించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 53 లక్షల మంది మిస్డ్ కాల్ ద్వారా వారి సంతృప్తిని వెల్లడించినట్లు తెలిపారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకం ప్రజల్లో సంతృప్తిని నింపింది అన్నారు. 2024 లో సీఎం జగన్ మళ్లీ సీఎం అవుతారని ధీమా వ్యక్తం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, మేయర్ అముద, చూడ ఛైర్మన్ పురుషోత్తం రెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుడిపల్లి: మండలంలోని కోటపల్లి గ్రామంలో శనివారం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి జగనన్న స్టిక్కర్లను అతికిస్తూ జగనన్న సంక్షేమ పథకాలను జడ్పిటిసి కృష్ణమూర్తి వివరించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ జగనన్న బాటలో మనమందరం నడిచి, జగనన్న ప్రభుత్వాన్ని బలపరచాలని గడపగడపకు వెళ్లి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోపి, పంచాయతీ పార్టీ ప్రెసిడెంట్ మంజునాథ్, సుబ్బు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని మామడుగు గ్రామ సచివాలయ పరిధిలోని మామడుగు, కోటగురువే పల్లి, అప్పిశెట్టిపల్లి, చెన్నారెడ్డి పల్లి, కంచిరెడ్డి పల్లి గ్రామాలలో "గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమంలో భాగంగా మీ గడప వద్దకే మీ ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించి 612 గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు వెంకటే గౌడ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ భాస్కర్ రెడ్డి, మండల వైసీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



జాగ్రత్తలతో అగ్నిప్రమాదాలు దూరం



ప్రజాశక్తి-నగరి: అజాగ్రత్తే అగ్నిప్రమాదానికి దారితీస్తుందని ఫైర్ ఆఫీసర్ మస్తాన్ అన్నారు. శనివారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రైల్వేస్టేషన్, బస్టాండు ప్రాంగణంలోని ప్రయాణికులకు అగ్ని ప్రమాదాల నివారణ కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా మస్తాన్ వంటింటిలో అగ్ని ప్రమాదాలకు దారితీసే అంశాలు, విద్యుత్ సంబంధిత అజాగ్రత్తలతో ఏర్పడే అగ్ని ప్రమాదాలు, పాఠశాలలు, ఆసుపత్రిలు, వాణిజ్యసముదాయాలు, గోదాములు, కర్మాగారాలు, గ్రామీణ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలకు దారితీసే అంశాలు, ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది కెబిబి ప్రతాప్, డిసి రాజు, ప్రవీణ్ కుమార్, విజయన్, మల్లికార్జున, కోటేశ్వర రావు, మధు, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు: ప్రజలకు సేవ చేయడమే మా కర్తవ్యం అని పుంగనూరు అగ్నిమాపక శాఖ అధికారి సుబ్బరాజు తెలిపారు. శనివారం అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా రెండవ రోజు మేలు పట్ల నుంచి తూర్పు మగసాల వరకు సిబ్బందితో కరపత్రాలను పంపిణీ చేస్తూ అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఏప్రిల్ మాసంలో అగ్నిమాపక వారోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. అలాగే ఈ ఏడాది కూడా ఏప్రిల్ 14 నుండి 20 వరకు ఏడు రోజులు అగ్ని ప్రమాదాలపై వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో వాల్ పోస్టర్లు అతికించడం, ర్యాలీ నిర్వహించినట్టు తెలిపారు. ఎంపీడీవో ఆఫీసు కూడలిలో వివిధ రకాల విన్యాసాలు చేసి ప్రజలకు చూపించడం జరిగింది. అగ్నిమాపక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



కవులకు సన్మానం



ప్రజాశక్తి-పుంగనూరు: పుంగనూరు కవులు, రచయితలు తిరుపతి మహతి వేదికలో ప్రశంసలు అందుకోవడం ఎంతో సంతోషించదగ్గ విషయమని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎన్.ఆర్ అశోక్, శ్రీనివాసులు, రాజులు అన్నారు. శనివారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో పుంగునూరు కవులు, రచయితలను సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ మాట్లాడుతూ సాహితీవేత్తలు, కవులు, రచయితలుగా పుట్టిన ఊరు పుంగనూరు, వాసులకి మంచి గుర్తింపుతో ఉమ్మడి రాష్ట్రాలలో పేరు తీసుకువస్తున్న సరస్వతీ పుత్రులైన రచయిత సాహితీవేత్తలు ఉపాధ్యాయులు పరాంకుశ నాగరాజ, జర్నలిస్టు, న్యాయవాది తల్లా శ్రీనివాస్, జర్నలిస్టు, కవి సాల్వరాజు సతీష్ కుమార్, ఎలక్ట్రీషియన్ ఆవుల పల్లి రెడ్డెప్ప మంచి కవితలను తిరుపతి మహతి వేదికలో కనబరచారన్నారు. వందలాది మంది కవుల, రచయితల ప్రశంసలతో పుంగనూరు ఖ్యాతిని చాటినందుకు వీరిని సన్మానిస్తున్నామని చెప్పారు. ఘంటసాల నూర్ భాషా అందరినీ అలరించారు. కార్యక్రమంలో నరసింహులు, నాగరాజ, కృష్ణప్ప, నాగేనాయక్ పాల్గొన్నారు.

మేటిమందలో 104 సేవలు




ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఇరికిపెంట పంచాయతీ మేటిమంద గ్రామంలో శనివారం సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో 104 సేవలను ప్రజలకు అందజేశారు. గ్రామంలోని 40 మంది వద్ధులు, పిల్లలకు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులు, మాత్రలను పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది మదనిక, అమర్‌నాథ్, శాంభవి, ఆశా కార్యకర్తలు గుణవతి, శ్రీలక్ష్మి, నాగరత్న, 104 వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్ సర్వే పరిశీలన



ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఇరికిపెంట పంచాయతీలో ప్రారంభమైన డ్రోన్ భూ సర్వే కార్యక్రమాన్ని డిప్యూటీ తహశీల్దార్ ప్రకాష్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రోన్ సర్వే నిర్వాహకులకు, సర్వేయర్లకు పలు సూచనలను అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఏ సుగుణ పాల్గొన్నారు.

కనులవిందుగా లక్ష్మీనారాయణుల కల్యాణం



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో గల శ్రీ లక్ష్మీ నారాయణ స్వామిలకు కల్యాణోత్సవం పూజలను భక్తులు కనువిందు గావించారు. ఆలయంలో శనివారం స్వామి అమ్మవార్లను సుప్రభాత సేవతో మేలుకొలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుండి తరలి వచ్చిన భక్తులకు ఆలయంలో అన్నదానం చేశారు. తిరుపతికి చెందిన ప్రవీణ్ కుమార్ దంపతులు అన్నదానం కల్యాణోత్సవానికి ఉభయదారులుగా వ్యవహరించారు .

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



ప్రజాశక్తి-రామకుప్పం: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే నవ్యాంధ్ర అభివద్ధి సాధ్యమని, రాష్ట్ర ప్రజలంతా నమ్ముతున్నారని పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికై తొలిసారిగా కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా శనివారం రామకుప్పంకు వచ్చిన ఆయనకు టీడీపీ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అంతరం స్థానిక బీఆర్‌డీ కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన సన్మాన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో అభివద్ధి కుంటుపడిందని, సంక్షేమం కొందరికే పరిమితం అయిన విషయాన్ని ప్రజలు గుర్తించారని కోరారు. అందుకే పట్టభద్రుల ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులను ఓడించారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూడా ఇవే ఫలితాలు పునరావత మవుతాయన్నారు. కార్యక్రమంలో నేతలు మునస్వామి, ఆనందరెడ్డి, ఆంజనేయ రెడ్డి, నరసింహులు, సజ్జల కోదండరెడ్డి, సుబ్రి, పద్మనాభ రెడ్డి, సతీష్, అవినాష్, అమర్, ఆదిల్ తదితరులు ఉన్నారు.

విద్యకు మించిన సంపద లేదు



ప్రజాశక్తి-కార్వేటినగరం: ప్రపంచంలో విద్యకు మించిన సంపద లేదని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ యు.నరసింహులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహా ప్రైవేటు పాఠశాలలో 12వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాట్లాడుతూ పేదరికం విద్యకు అడ్డురాదని, కష్టపడి చదివిన వారు రాణించడం ఖాయమన్నారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి విజయకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలలో కూడా నిరుపేదలకు ఉచితవిద్యను అందించడానికి ముందుకొచ్చిందని, ఇలాంటి అవకాశాలను విద్యార్థులు క్రమశిక్షణతో సద్వినియోగం చేసుకొని గొప్ప విద్యావంతులుగా రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. పాఠశాల డైరెక్టర్లు దిలీప్, ధనంజయులురెడ్డి, పురుషోత్తం, వెంకటేష్, కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన అంబేద్కర్ విగ్రహావిష్కరణ



ప్రజాశక్తి-నగరి: మండలంలోని అడవి కొత్తూరు దళితవాడలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ నూతన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘ జాతీయ కార్యదర్శి గోవిందస్వామి, రాష్ట్ర అధ్యక్షులు పుణ్యమూర్తి మాట్లాడుతూ ప్రపంచమంతా రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను జరుపుకుంటున్న వేళ, నగరి రూరల్ మండలంలో అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరించడం ఆనందదాయకమన్నారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘ జాతీయ ఉపాధ్యక్షులు ఎంకే ప్రకాష్, జిల్లా కార్యదర్శి వేళాయుధం, నగరి మండల అధ్యక్షులు బాలవర్ధన్ రాజు, విజయ్, రజిని, మైలు స్వామి, తంగ రాజు, మధుబాబు, మురళి, వెంకటేష్ పాల్గొన్నారు.

ముగిసిన పది పరీక్షలు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: పదో తరగతి పరీక్షలు ఈనెల 3 నుంచి 15వ తేదీ వరకు ప్రశాంత వాతావరణంలో ఆరు పరీక్షలు జరిగాయని మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వర రావు శనివారం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని తెలిపారు.

పాలసముద్రం: మండలంలోని పాలసముద్రం ఉన్నత పాఠశా



లలో జరుగుతున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు నేటితో ముగిశాయని ఎంఈఓ రాజేంద్రప్రసాద్, చీఫ్ సూపరింటెండెంట్ సరన రెడ్డి శనివారం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 3వ తేదీ నుంచి జరిగిన పబ్లిక్ పరీక్షలో పరీక్షా కేంద్రాలలో ఇబ్బంది లేకుండా ఎస్సై బి సురేష్ గట్టి బందోబస్తు ఇచ్చారని తెలిపారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా పరీక్షలు రాసినట్లు విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు

ప్రజాశక్తి-నగరి: పట్టణ పరిధి బైపాస్ కూడలి సమీపంలోని శ్రీ ధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం విషు పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఫల, పుష్పాలంకరణ పలువురిని అలరించింది. భక్తుల కోసం ఆలయం బయట చలువ పందిళ్లు వేశారు. ఉదయం 5 గంటల నుంచే ఆలయంలో అయ్యప్ప భజనలు ప్రారంభమయ్యాయి. గురుస్వామి మురళి, భక్తులు కన్నప్ప, మునస్వామి, రమేష్ బాబు, దుర్గాప్రకాష్ స్వామి, రవి పాల్గొన్నారు.

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి | ఏడీఏ

ప్రజాశక్తి-యాదమరి: ప్రతి రైతు భూసార పరీక్షలు తప్పక చేయించుకోవాలని ఏడీఏ మధుసూదనరెడ్డి తెలిపారు. శనివారం కాసిరాళ్ల రైతు భరోసా కేంద్ర పరిధిలో భూమి ఆరోగ్యం, భూసార పరీక్ష చేసే విధానంపై సిబ్బందికి, రైతులకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో భాగంగా మండల వ్యవసాయ అధికారిణి టి చరిత మాట్లాడుతూ చెట్ల నీడలోన, ఎరువులు వేసిన దగ్గర, పంటలు ఉండే దగ్గర, గట్ల వెంబడి కాలిబాటల వెంబడి మట్టి సేకరణ చేయకూడదని, ఎటువంటి పంటలు లేకుండా ఖాళీగా ఉండే పొలాలలో మట్టి నమూనా సేకరించాలన్నారు. జిల్లా వనరులకేంద్రం ఏఓ లక్ష్మీప్రసన్న వివిధ రకాల నేలలు, వాటిలో వివిధ రకాల పోషకాలు ఎంత మోతాదులో ఉండాలి, వాటి ఆవశ్యకత, పీహెచ్‌ఈసీ సేంద్రియ కర్బనం, నత్రజని, భాస్వరం, పోటాష్, ఇతర స్థూల, సూక్ష్మ, పోషకాల గురించి చాలా క్షుణ్ణంగా వివరించారు. ఏడీఏ మధుసూదన రెడ్డి మాట్లాడుతూ రైతులు వర్షాల ఆధారంగా పండే పొలాలలో మూడు సంవత్సరాలకు ఒకసారి అదేవిధంగా నీటి ఆధారిత పంటలను పండించే భూములలో మూడు సీజన్లకు ఒకసారి 2.5 ఎకరాలలో 8-10 చోట్ల వి ఆకారంలో మట్టిని తవ్వి సేకరించి, ఈ విధంగా సేకరించిన మట్టిని చతుర్విభజన పద్ధతిలో నాలుగు భాగాలుగా చేసి దానిని అరకేజీ వచ్చేంతవరకు చేసి ఆ శాంపిల్



సోమల


ను ప్లాస్టిక్ బ్యాగ్‌లో వేసి, రైతు యొక్క వివరాలు, పంటల వివరాలు జాగ్రత్తగా పరీక్షా కేంద్రానికి పంపించాలన్నారు. ఈ విధంగా పరీక్షించిన తర్వాత భూ పరీక్ష పత్రం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. దీంట్లో ఆ భూమిలో ఏ పోషకాలు ఎంత మోతాదులో ఉన్నాయి, ఏ పంటకు ఏ ఏ ఎరువులు ఎంత మోతాదులో వేయాలో చాలా స్పష్టంగా వస్తుందన్నారు. భూసార పరీక్ష పత్రం అనుగుణంగా రైతులు ఎరువులను వాడినట్లైతే పెట్టుబడిని తగ్గించుకొని, నాణ్యమైన పంటను, అధిక దిగబడిని పొందవచ్చునని తెలిపారు. అదే విధంగా భూమి ఆరోగ్యాన్ని, తమ ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని రైతు భరోసా కేంద్ర అధికారులకు వివరించినట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, రైతు భరోసా అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పులిచెర్ల: భూసార పరీక్షలతో అధిక దిగుబడి సాధ్యమవుతుందని సహాయ వ్యవసాయ సంచాలకులు శివకుమార్ తెలిపారు. శనివారం పులిచెర్ల మండలం కల్లూరు ఆర్బీకే కేంద్రం పరిధిలో భూసార పరీక్షలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ హరిప్రసాద్, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరు: మండలంలోని కల్లాడు రైతు భరోసా కేంద్ర పరిధిలో భూసార పరీక్ష విధానం వాటి ఆవశ్యకతపై రైతు భరోసా కేంద్రం సిబ్బందికి, కల్లాడు రైతులకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా ఏడీఏ అన్నపూర్ణాదేవి విచ్చేశారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది, నరసింహారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోమల: భూమి ఆరోగ్యంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని పుంగనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు శివకుమార్ అన్నారు. మండల కేంద్రమైన సోమల సమీపంలోని దిడ్డివారిపల్లె గ్రామానికి చెందిన రైతుల భూములలో మట్టి నమూనా భూసార పరీక్షలపై రైతు భరోసా కేంద్ర సిబ్బందికి పలువురు రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారి సుధాకర్, పుంగనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు శివకుమార్, రైతు భరోసా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కులంపేరుతో దూషించాడని ఫిర్యాదు



ప్రజాశక్తి-రామకుప్పం: కులం పేరుతో దూషించాడని వైసిపి నాయకులు శనివారం రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని పెద్ద తండా గ్రామ సర్పంచ్ మోహన్ నాయక్ గుడిపల్లి మండలంలోని ద్రావిడ విశ్వవిద్యాలయ రిజిస్టర్ వేణుగోపాల్ రెడ్డి పై ఈ మేరకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి సందర్భంగా గిరిజన ప్రజాప్రతినిధులను ఆహ్వానించలేదని ఫోన్ ద్వారా రిజిష్టర్‌ను అడిగినందుకు నువ్వు గిరిజన ప్రతినిధి, నాయకుడు అయితే నిన్ను పిలవాలా, రూల్స్ ఏమైనా ఉందా? అంబేద్కర్ ఏ కులం, మీది ఏ కులం, నువ్వు లంబాడి కులం రా, నీకు ఏం పని ఉంది అని దూషించాడన్నారు. మళ్లీ ఇంకోసారి ఫోన్ చేస్తే నీ అంత చూస్తానని బెదిరించాడన్నారు. దీనిపై విచారణ జరిపి ద్రావిడ విశ్వవిద్యాలయ రిజిస్టర్ వేణుగోపాల్ రెడ్డి పై తగు చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో కోరాడు. మోహన్ నాయక్ వెంట ఎంపిపి సుబ్రమణ్యం, వైసీపీ మండల కన్వీనర్ బాబు రెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, చెంగారెడ్డి ఉన్నారు.